# 5

# జీవాన్ని ప్రసాదించిన వ్యక్తి

## (2 రాజులు 4:8-17)

ఎలీషా జీవితంలో ఒక ప్రత్యేకతను సంతరించుకొన్న ఘట్టం ఏమంటే, ఒక స్త్రీ "ఒక ప్రవక్త గదిని" నిర్మాణం చేయడం తద్వారా బహుమానంగా ఒక కుమారుని పొందడం. అందరికి పరిచయమైన ఈ కథ చిన్నపిల్లల బైబిల్ తరగతులలో ప్రత్యేకంగా నిలిచింది. నేను ఈ అంశానికి చక్కని నామకరణం చేస్తున్నాను, "జీవాన్ని ప్రసాదించిన వ్యక్తి."

### ఆతిథ్యాన్ని అందించడం (4:8-11)

ఎలీషా ఇశ్రాయేలు దేశమంతా విస్తృతంగా పర్యటించాడు. అతడు తరచుగా ప్రయాణం చేసిన మార్గము (8, 9 వచనాలు) యెజ్రెయేలునుండి ప్రారంభమౌతుంది, యిక్కడే రాజు యొక్క వేసవి భవనం నిర్మించబడి ఉంది (1 రాజులు 18:46; 21:1). కర్మెలు వరకు ప్రయాణం చేసాడు. ఈ కర్మెలు ఎలీషా బయలు ప్రవక్తలను ఎదుర్కొనిన స్థలము (1 రాజులు 18). బహుశ ఎలీషా తన విస్తారమైన పరిచర్యనుండి కొంత విశ్రాంతి తీసుకోవడానికి కర్మెలు పర్వతానికి వెళ్లియుండవచ్చు.

యెజ్రెయేలుకు మూడు మైళ్ళ దూరములో కర్మెలు పర్వత మార్గములో షూనేము అనే గ్రామము ఉన్నది (యెహోషువా 19:18 చూడు; 133వ పేజీలోని పటాన్ని చూడు). షూనేము పర్వతాలన్నింటిలోకల్లా ఎతైన స్థానము నిలిచి ఉన్నది, "చుట్టూ పచ్చని ఓలీవ చెట్లు తోటలతో నిండుగా పండిన మొక్కజొన్న పొలములతో విరాజిల్లుచున్నది." ఒక చిన్న పట్టణము "ఎక్కువగా రైతులు నివసించే ప్రాంతము. అన్ని వసతులతో నిరాడంబరంగా జీవనం సాగిస్తున్న స్థలమిది."[1] యెజ్రెయేలుకు షూనేము పట్టణానికి మధ్య కొన్ని మైళ్ళ దూరం ఉన్నది. కానీ, ఈ రెండు ప్రభువుకు మహిమనివ్వడములో విరుద్ధ ప్రపంచాలుగా నిలిచాయి. ఇశ్రాయేలు ఎంతో కాలంగా రాజుల వెర్రితనానికి కేంద్రంగా నిలిచింది (1 రాజులు 21; 2 రాజులు 9:30 చూడు). కానీ, ఈ షూనేము గ్రామములో కొందరి హృదయాలలోనైనా విశ్వాసపు జ్వాలలు వెలుగుతూనే ఉన్నాయి.

**ఆతిథ్యానికి ఒక ఉదాహరణ**

ఈ షూనేము పట్టణములోని ఒక నమ్మకమైన వ్యక్తిని గురించి ప్రారంభ వచనాలలోనే ప్రస్తావించడం జరిగింది: "ఒక దినమందు ఎలీషా షూనేము పట్టణమునకు పోగా, అచ్చట ఘనురాలైన యొక స్త్రీ ఉంది" (2 రాజులు 4:8ఎ). ఆమె పేరు మనకు తెలియదు. కానీ, ఆమె పిల్లల్ని కనే వయస్సులో ఉంది. ఆమె భర్త వృద్ధుడు[2] (14వ వచనం). అతడు ఒక వ్యవసాయదారుడు (18వ వచనం). మనం ఇంతకు ముందే చెప్పుకున్న రీతిగా ఆమె ఒక "ప్రముఖురాలు." ఆమె తన ఆస్తిపాస్తులను బట్టిగానీ, ఆమె సమాజములో స్థాయిని బట్టిగానీ, ఆమె ప్రముఖురాలని తెలిసికొనలేము.[3] NIV ప్రచురణ ప్రకారం సమాజములో ఆమె

"భాగ్యవంతురాలు." అన్నింటికంటే ముఖ్యంగా ఆమెకు ప్రభువు నందు పట్టరాని విశ్వాసము ఉంది. ఆ దేశములో వాస్తవానికి విగ్రహారాధన మితిమీరిపోతూ ఉన్నది (9, 16 వచనాలు; 1 రాజులు 19:18 చూడు).

ఏదో ఒక విధంగా, ఆమె ఎలీషాకు పరిచయమైయింది. బహుశ ఎలీషా ఆయా పట్టణాలలో తిరుగుతూ బోధించేవాడు కాబట్టి ఆమె అతని బోధలు వినడం ద్వారా అతన్ని ఎరిగియున్నది. ఒకరోజు ఆ గ్రామం గుండా వెళ్ళుతుండే ఆమె అతన్ని చూచి గుర్తుపట్టింది. బహుశ, అతడు అప్పటికే లోకానికి పరిచయమైన ప్రముఖ వ్యక్తిగా నిలిచి యుండవచ్చు. ఆమె అతన్ని ఒకసారి తన ఇంటికి భోజనానికి ఆహ్వానించింది. యిక్కడ వాక్యము ఏమి చెప్పుతుందంటే "భోజనమునకు రమ్మని బలవంతము చేసెను" (2 రాజులు 4:8బి). (CJB) ప్రచురణలు ఈ మాటను "వత్తిడి చేసింది" రమ్మని ఆమె "బ్రతిమిలాడింది" అని (NCV); మరియు ఆమె అతన్ని "వేడుకొన్నదని" (NIV) తెలుపుతున్నాయి; నేను ఎక్కడ ఉంటానో, మీరు అక్కడ ఉంటారు. "ఒకవేళ అతను రాను అన్నను ఆమె అతన్ని విడిచిపెట్టేటట్టు లేదు."

ఎలీషా, ఆమె ఆహ్వానాన్ని మన్నించాడు. సామాన్యంగా దేవుని సేవకులు వారిని ఎవరైనా భోజనానికి ఆహ్వానిస్తే వారు అవకాశాన్ని పోగొట్టుకోరు. అప్పటికే ఎలీషాకు గెహజీ అనే పేరుగల సేవకుడు ఉన్నాడు (12వ వచనం) అంటే ఈ ఆహ్వానము *ఇద్దరికి చెందినదన్నమాట.*

ఇంతకు ముందు పాఠములో, ఎలీషా ఒక బీదరాలైన స్త్రీకి సహాయం చేయడం చూచాము; ఇక్కడ ఈ వాక్యభాగంలో, బాగా ఆస్తిపరురాలైన స్త్రీకి సహాయం చేయడం చూస్తున్నాము. దేవుని వలెనే ఇతను కూడ "పక్షపాతము చూపని స్వభావాన్ని" వ్యక్తము చేస్తున్నాడు (అపొస్తలుల కార్యములు 10:34). దీన్నిబట్టి చూస్తే ఎలీషా ఒక ప్రక్క ధనికులకును, ఒక ప్రక్క బీదలకును, ఒక ప్రక్క శక్తిమంతులకును, మరో ప్రక్క బలహీనులకును కావలసిన వ్యక్తి అని అర్థం అవుతుంది.

భోజనానంతరం ఎలీషా వెళ్ళిపోతుంటే ఆ ప్రాంతంలోకి అతడు ఎప్పుడొచ్చినా వారి యింట్లో భోజనం చేయవలెనని ఆమె అతన్ని బ్రతిమాలింది. చివరి 8వ వచనం యిలా వుంది, "గనుక అతడు ఆ మార్గమున వచ్చినప్పుడెల్ల ఆమె ఇంట భోజనము చేయుచువచ్చెను." ఆ కుటుంబములో ఎవరు వంటచేసినా ఆ వంటవాడు ఎంతో నిపుణుడై ఉంటాడు. బోధకులు కుటుంబాల్లో చేసే వంటలకు ఎంతో ఇష్టపడతారు; ఒకవేళ గనుక ఆ వంటలు రుచికరంగా లేకపోతే, మరలా ఆ గృహాన్ని దర్శించరు.

ఈ షూనేమియురాలి గృహములో చేయబడే వంటల గురించి బైబిలు ఎలాంటి వివరాలు ఇవ్వడం లేదు కానీ, ఆ భోజనపు బల్ల దగ్గర జరిగే సంభాషణను బట్టి దాని శ్రేష్ఠతను గుర్తించవచ్చు. ఎలీషా ఆమెతో తన గత చరిత్రను చెబుతూ ఉండవచ్చు – అతను ఏలీయా వద్ద పనిచేసినప్పుడు యెహోవా చేసిన గొప్ప కార్యాలను గురించి వివరిస్తూ ఉండవచ్చు. ఆమె వింటూ తల ఊపడం నేను చూస్తున్నాను. ఆ ప్రవక్త యొక్క సేవా విధానాన్ని చూచి ఆమె ఎంతో మేలుపొంది ఉండవచ్చు. ఎలీషా కూడ దేవుడులేని ఆ దేశములో ఇంత గొప్ప విశ్వాసముగల స్త్రీ ఉండడం చూచి అతను ఎంతో ప్రోత్సాహం పొంది ఉంటాడు. అలాంటి విశ్వాసముగల వ్యక్తులతో సమయం గడపడం ఎంత ఆశీర్వాదకరంగా ఉంటుందో చెప్పలేము.

ఈ కథ మనం ముందుకి చదువుతూ ఉంటే ఆ కుటుంబములో ఆత్మీయ విషయాల

పట్ల ఆమె ఎంత ఆసక్తి కనపరుస్తుందో తెలుసుకోగలము (8, 9, 25 వచనాలు). ఒక కుటుంబంలో ఒక తండ్రి లేదా, భర్త ఆత్మీయ విషయములతో నాయకులుగా ఉండాలని బైబిలు చెప్పుచున్నది (ఎఫెసీయులకు 6:4). కానీ, ఈ రోజుల్లో అనేక కుటుంబాల్లో ఇది జరగడం లేదు. అటువంటి పరిస్థితులలో ఉన్నప్పుడు ఒక స్త్రీ ఏమి చేయగలదు? షూనేమియురాలు వలె వారు చేయవలెను: మీ యొక్క విశ్వాసాన్ని మీరు కాపాడుకుంటూ మీ భర్తగారిని మంచి విషయాలు జరిగించటానికి ప్రోత్సాహించండి (1 పేతురు 3:1, 2 చూడు).

ఒకరోజు, ఆ స్త్రీ తన భర్తతో యిలా అన్నది, "మనయొద్దకు వచ్చుచు పోవుచున్నవాడు భక్తిగల దైవజనుడని నేనెరుగుదును" (9 వచనం). "పరిశుద్ధత" అను మాటకు అర్థం "ప్రత్యేకింపబడుట." పాతనిబంధనలో ఒక ప్రవక్తకు[4] "పరిశుద్ధత" అని ఆపాదించడం యిదే మొదటిసారి. ఒక విచారకరమైన విషయం, "దైవజనుడు" అని చెప్పుకునే వ్యక్తులు ఈ రోజున అలా జీవించడంలేదు. ఎలీషా ఆమె గృహాన్ని తరచుగా దర్శించడం వలన ఆమె అతనికి ఒక "ప్రత్యేకించబడిన" వాడని దేవుని యొక్క ప్రతినిధి అని ఒప్పింపబడినది.

ఆమె తన భర్తకు ఒక అభ్యర్థన చేసింది: "కావున మనము అతనికి గోడమీద ఒక చిన్న గది కట్టించి, అందులో అతనికొరకు మంచము, బల్ల, పీట దీపస్తంభము నుంచుదము; అతడు మనయొద్దకు వచ్చునప్పుడెల్ల అందులో బసచేయవచ్చునని చెప్పెను" (10 వచనం). ఆమె ఆ ప్రవర్తనకు తన గృహములో సమమైన కప్పుదగ్గర ఒకగది కట్టుదామని అనుకొనినది (CJB ప్రచురణ చూడు). ఈ గది ఎంతో కఠోరమైన జీవిత విధానం కల్గిన ప్రవక్తకు అన్నివిధాల నివాస యోగ్యంగా ఉంటున్నది అనియు – ఇది కేవలం అతని కొరకే ఉండాలని కోరుకున్నది. యిది అలజడి అల్లరి ప్రపంచానికి దూరంగా ఉంటూ అతనికి విశ్రాంతి స్థలముగా ఉండగలదు. (ఇక్కడ ఈ గదిలోని ఉంచబడే గృహోపకరణములు ఎలీషా కోసమై కానీ, అతని సేవకుడైన గెహజీకి ప్రత్యేకమైన వేరే ఏర్పాటులు చేయబడి ఉండవచ్చు [11, 12 వచనాలు].)

ఆమె భర్త ఈ విషయంలో ఎలా స్పందించాడో తెలియదు. బహుశ సంతోషంగా, ప్రోత్సాహకరంగా తల ఊపాడు, లేదా, ఆమెను ఎగతాళి చేస్తూ నవ్వుతూ వయస్సులో ఉన్న తన భార్య వెర్రిది అన్నట్టు వ్యతిరేకించవచ్చు. కానీ, అప్పటికి మాత్రం అతను ఆమె సలహాని అంగీకరించాడు – గది కూడ కట్టించాడు. బహుశ అది ఏదో సామాన్యమైనదిగా ఉండి ఉండవచ్చునేమో కానీ, ఆ స్త్రీ అన్నివిధాల శ్రద్ధ తీసుకొని ఏర్పాటులన్ని చేసింది అన్న విషయం నీవు మరచిపోవద్దు, ఆమె మొట్టమొదటిగా ఏలీయాకు ఆ గది చూపించినప్పుడు ఆమె పెదాలపై చిరునవ్వు ఎలా తొణికిసలాడిందో అన్న ఊహా చిత్రాన్ని నేను ఊహించగలను. ఎలీషా ఈ విషయంలో ఎంత ఆనందభరితుడు అయ్యాడో కదా? ఆ ప్రాంతానికి అతడు వచ్చినప్పుడెల్లా తనకు విశ్రాంతి గది ఉన్నదని ఎంతో సంతృప్తిపడినాడు (11 వచనం). ఆ ఒక్క షూనేమీ స్త్రీ యొక్క ఆదర్శం "ప్రవక్తలకు గది నిర్మించటం" అనేక మహిళలకు ఆ ప్రాంతంలో గొప్ప మార్గదర్శకమైయింది: దర్శించే బోధకులకు మరియు మిషనరీలకు ప్రత్యేకమైన గదులు కట్టించి ఉంచడం అలవాటు అయ్యింది.

**ఆతిథ్యానికి ప్రోత్సాహము**

ఈ స్త్రీని వివరించే ఒకమాట ఉన్నది. ఆతిథ్యం అనే మాట లాటిన్‌లో *hospes* అనే

మాటనుండి వచ్చింది. యిక్కడ హోపెస్ అనగా అతిథి. "(Guest) ఆతిథ్యం" అనేది యితరులను ఎంతో సాదరంగా చూసుకోవడం అనే అర్థం. పాత నిబంధనలో అతి ప్రాముఖ్యమైన అంశము ఆతిథ్యం. పెద్దల యొక్క ప్రత్యేకమైన లక్షణాలలో ఒకటి ఆతిథ్యం యివ్వడం (1 తిమోతి 3:2; తీతుకు 1:8). పేతురు "ఒకరినొకరు ఆతిథ్యం యిచ్చుట సణుగుకోకుండ చేయుడి" (1 పేతురు 4:9).

హెబ్రీ గ్రంథకర్త యిలా అంటున్నాడు, "మీరును వారితో కూడ బంధింపబడినట్టు బంధకములోనున్న వారిని జ్ఞాపకము చేసుకొనుడి" (హెబ్రీయులకు 13:2). యిది బహుశ దేవదూతలకి ఆతిథ్యమిచ్చిన అబ్రహామును పోలియున్నది (ఆదికాండము 18:1-8, 16, 22; 19:1 చూడు). యిప్పటికి మనం తెలియకుండానే దేవదూతలకి ఆతిథ్యం ఇస్తున్నామా? హెబ్రీయులకు 13:2. ఆ విధంగా చెప్పడంలేదు; గతంలో ఏమి జరిగిందో దాన్ని మాత్రమే ప్రస్తావిస్తుంది. అది ఈ రోజుల్లో సంభవిస్తుందా అని మనం ప్రత్యేకంగా ఊహించే పనిలేదు. ఒక వేళ ఊహించిన మనకేం అర్థం కాదు సుమా! యిక్కడ గ్రహించవలసిన విషయం ఏమంటే మనం పరాయి వాళ్ళకి కూడ అది ప్రభువు నుండి మనకి వచ్చిన ఆదేశమునుబట్టి ఆతిథ్యం యివ్వాలని (మత్తయి 25:35, 38, 40 చూడు)!

ఒకవేళ మీరు కనుక ఆతిథ్యమిచ్చిన కుటుంబాలనుండి వచ్చినట్టయితే, ఆ జ్ఞాపకాలు ఎంత పవిత్రంగా ఉంటాయో! బహుశ, "మన ఇంటిలో మరొకరికి స్థానమున్నది!" అని మీ నాన్నగారు అనడం ఎంత ఆదరణకరంగా ఉంటుందో కదా! బహుశ, మీ అమ్మగారు అమ్మా! మన ఇంటికి ఎవరో సందర్శకులు వస్తున్నారంట అన్నప్పుడు ఎంతో ఆనందముతో పొంగిపోయినప్పుడు అంతకన్న మీరు జ్ఞాపకముంచుకోగల విషయం ఏమున్నది చెప్పండి? ఆదివారం మీ ఇంటికి బోధకుడు వస్తున్నాడంటే ఆ జ్ఞాపకాలు మధురంగా ఉంటాయా లేదా, మీ పట్టణములో సువార్త కూడికలు కొరకు వచ్చిన ఆ సువార్తికుడు ఆ రోజు మీ గృహము దర్శిస్తుంటే, గత అనేక సంవత్సరాలలో కొందరు సోదర సోదరీమణులు వారి అనుభవాన్ని తెలుపుతూ వారి భోజనపు బల్ల దగ్గర భుజించిన అనేక మంది బోధకులతో వారి తండ్రిగారు సంభాషిస్తూ ఉంటే ఆ సంభాషణ వింటూ తమ విశ్వాసమును బలపర్చుకొన్నాము అని చెప్పే వారిని గూర్చిన జ్ఞాపకాలు నాకెంతో ధన్యకరంగా ఉన్నాయి.

కొంతమంది, "ఆ ... మా గృహము కూడ ఎవ్వరిని ఆహ్వానించడానికి అంత అనువైన స్థలము కాదని" కొంతమంది ఆలోచిస్తూ అయిష్టపడతారు మరియు కొంతమంది "మేము భుజించే ఆహారాన్ని వారికి పెడితే ఇష్టపడతారా?" అని సందేహము వ్యక్తపరుస్తారు. హెబ్రీయులకు 13:2లో ఆహ్వానించడాన్ని గురించి ప్రస్తావించబడినది, ఒక రచయిత "ఆహ్వానించడము" మరియు "ఆతిథ్యము" ఇవ్వడము అనే మాటలకు ఎంతో వ్యత్యాసముంది:[5]

- "ఆతిథ్యమనేది ఏమి చెప్పుచున్నదంటే నాకున్నది కొద్ది కానీ ఎక్కువ కానీ అది దేవుని నుంచి ఇవ్వబడిన బహుమానము, అది దేవుని కొరకు వాడవలసినదే. అంతే కానీ, నాకున్న దాన్ని మీకు చూపిస్తూ మిమ్మల్ని ఆకర్షించాలని కాదు."
- ఆతిథ్యము చెవులలో గుసగుసలాడుచున్నది "నాదేంటో అది నీది కూడ, దాన్ని వాడుకో!" అంతేకానీ "ఇది నాది, ఆహా! ఇది ఎంత బాగుంది!" అంటూ

కేకలు వేయవద్దు.

- ఆతిథ్యం అనేది ఒకరికి వడ్డిస్తుంది కానీ, అభినందించాలని మాత్రం కోరుకోదు.
- ఆతిథ్యం ఒక సందర్శకుని ఎంతో ఆహ్లాదంగాను, తన స్వంత ఇంటివలె అభ్యంతరాలు లేకుండ మెలగడానికి వీలుపడుతుంది. అదే ఈ లోకరీతిగా "ఆహ్వానము" కనుక అయితే కొంత ఇబ్బందికరంగానే ఉంచుతుంది.

మన చేతులో ఉన్నదేదో అది ఒక బహుమానం కానీయండి, కానీ, మన హృదయములో ఉన్న దాతృత్వము దానికి సరితూగదు. ఒకసారి యేసు ఇలా అన్నాడు. "మరియు శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్లు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 10:42). మనము ఆతిథ్యాన్ని ఇవ్వడం అనే మంచి లక్షణాన్ని అలవర్చుకోడానికి దేవుడు మనకు సహాయం చేయునుగాక.

## ఆతిథ్యము దాని ఫలము పొందుతుంది (4:11-17)

**కృతజ్ఞత: అత్యవసరమైనది**

ఒకరోజు, ఎలీషా తన "గోడమీద గదిలో" (11 వచనం) విశ్రాంతి తీసుకొంటూ, ఆ స్త్రీ తనకు అందించిన ఆతిథ్యాన్ని గురించి ఎంతగానో ఆలోచించాడు. అందువల్ల ఆమెకు తన కృతజ్ఞత తెలుపుకోడానికి ఏదైనా చేయడానికి నిశ్చయించుకొన్నాడు. యేసు ఒకసారి యిలా అన్నాడు "ప్రవక్త అని ప్రవక్తను చేర్చుకొనువాడు ప్రవక్తఫలము పొందును; నీతిమంతుడని నీతిమంతుని చేర్చుకొనువాడు నీతిమంతుని ఫలము పొందును" (మత్తయి 10:41ఎ). ఆ స్త్రీ "ప్రవక్త యొక్క బహుమానాన్ని" పొందటానికి అదే సరైన సమయం అని ఎలీషా నిశ్చయించుకొన్నాడు.

"పిమ్మట అతడు తన దాసుడైన గేహజీని పిలిచి, – 'ఈ షూనేమీయురాలిని పిలువుమనగా వాడు ఆమెను పిలిచెను' " (2 రాజులు 4:12ఎ). గేహజీ గురించి మనం వినడం మొదటిసారి. యిక్కడ గేహజీ పరిచర్య ఎలా ఉన్నదంటే గతములో ఏలీయా వద్ద ఎలీషా చేసిన పరిచర్య వలె ఉన్నది. – కానీ, ఈ ఇద్దరి సేవకుల మధ్య వారి లక్షణాలలో ఎంతో వ్యత్యాసము ఉన్నది సుమా! దీని గురించి ముమ్ముందుకు ఇంకా ఎక్కువగా చర్చించుకుందాం.

గేహజీ ఈ స్త్రీని ఎలీషా నొద్దకు తీసుకొనివచ్చాడు. "ఆమె అతని ముందర నిలువబడింది" (12బి వచనం). ఎలీషా వాస్తవానికి ఏమి మాట్లాడలేదు. అతను మాట్లాడినదంతా గేహజీతోనే: "అతడు – నీవు ఇంత శ్రద్ధా భక్తులు మాయందు కనుపరచితివి నీకు నేనేమి చేయవలెను?" (13ఎ వచనం). మరి ఎలీషా ఆ స్త్రీతో సూటిగా ఎందుకు మాట్లాడలేదో మనకు స్పష్టంగా తెలియదు (తరువాత అతడు ఆమెతో మాట్లాడినాడు 15, 16, వచనాలు చూడు). కొంతమంది రచయితలు దీనికి కారణము, బహుశ, కొన్ని కొన్ని మర్యాదలు ఎలీషా అనుసరించవలసినదేమో అని అంటారు.[6]

నాకు కూడ ఆ ఆచారాలు గురించి అంతగా తెలియదు. కానీ, దేవుని సేవకుడు

అనబడినవాడు స్త్రీలతో ఎలా సంభాషించాలో కొంత తెలిసికొని ఉండటం మంచిది. నేను సంపూర్ణ సేవలో ఉన్నప్పుడు ఒకసారి నా బోధ వినడానికి ఒక స్త్రీ వచ్చింది. నా గది తలుపులు తెరిచియుంచాను. (ఆ సంఘ కార్యదర్శి గారి ఆఫీసు దగ్గరలో వుంది.) నేను ఎప్పుడు కూడ ఒక స్త్రీని ఆమె ఇంటి వద్దకు వెళ్ళి దర్శించలేదు; ఎప్పుడు నా భార్య నాతో ఉండేది. ఇలా దేవుని సేవకులు అజాగ్రత్తగా ఉంటే సేవాభంగము కాగలదు (లింగబేధముల విషయంలో).

ఎలీషా ఆ స్త్రీతో మాట్లాడిన మాటలను మరొకసారి పరీక్షించుదాం: "అతడు – నీవు ఇంత శ్రద్ధా భక్తులు మాయందు కనుపరచితివి నీకు నేనేమి చేయగలను?" (13ఎ వచనం). ఇక్కడ "జాగ్రత్త" అనే మాట "ఉత్కంఠ."[7] ఈ రోజున, మనం, "మీరెంతో మా విషయంలో *శ్రద్ధ తీసుకొన్నారు*" అని అంటాము. దీన్ని NIV "మీరు నాకోసం ఎంతో శ్రమ తీసుకొన్నారు" అని ప్రచురించింది. దీన్ని CJB ప్రచురించిన విధానం నాకెంతో ఇష్టంగా ఉంది. 13వ వచనం: "మీరు నాకెంతో *ఆతిథ్యాన్ని ఇచ్చారు కదా!* మరి నేను దానికి బదులుగా మిమ్ములను *అభినందించడానికి* ఏమి చేయగలను?" (నొక్కి చెప్పింది నాది).

మనలో అనేకమంది ఆతిథ్యమియ్యడంలో ఎంతో శ్రద్ధ చూపాలి. తరువాత, ఈ విషయంలో అనేకులను అభినందించాలి. పౌలు ఇలా వ్రాస్తున్నాడు, "క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండ నియ్యుడి ... ; మరియు కృతజ్ఞులై యుండుడి" (కొలొస్సయులకు 3:15). హెబ్రీ గ్రంథకర్త ఇలా అన్నాడు, "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవ కృప కలిగియుందము" (హెబ్రీయులకు 12:28ఎ). పౌలు చెడ్డ వ్యక్తులు అని వ్రాసినప్పుడు ఒక లక్షణమును గురించి ప్రస్తావిస్తున్నాడు: "కృతజ్ఞతలేనివారు" (2 తిమోతి 3:2).

సి. ఇ. మేకర్‌ట్‌నీ ఇలా వ్రాస్తున్నాడు, "పాపాలన్నింటిలోకల్ల పెద్ద పాపం కృతజ్ఞత లేనితనం"[8] ఒక అపనమ్మకం గల వ్యక్తి ఇలా అన్నాడు, "నీవు కనుక కృతజ్ఞత అనే మాట వెతకాలంటే డిక్షనరీ[9] చూడండి." ఒక పసివాడు నూరు అంకెలు లెక్కబెట్టుట నేర్చుకుంటాడు. అయితే, మన ఆశీర్వాదములు లెక్కపెట్టుకోవడం నేర్చుకోవాలి.

ఒకరు ఇలా అన్నారు, "మన ఆలోచన మనయొక్క కృతజ్ఞత[10] తరువాతే వస్తుంది." మనం మన ఆలోచనకు కొంత సమయం ఇస్తే మనకు ఎంత కృతజ్ఞతగలవారై ఉండాలో ఆ విషయం బయటపడును. ఇలాంటి చక్కని కథలను నేర్చుకోడానికి నాకు ఎంతో సంతోషము, ఇలాంటి ఒక కథ ఒక వ్యక్తి గురించి చెప్పబడినది. ఒక తుఫాను ఆదివారము నాడు అతడు ఇలా ప్రార్థన చేసాడు. "దేవా! ఈలాంటి రోజు మరి ఎన్నటికి కనిపించడం కష్టం. అందుకు నీకు వందనాలు."[11] ఇంకొక ఆసక్తిగల కథ మ్యాత్యు హెన్రీగారు గురించి చెప్పబడినది. అతను ఒకసారి దొంగల ద్వారా ఎదుర్కొబడినాడు. అతను తన డైరీలో ఇలా వ్రాసుకొనినాడు:

> నేను ఎంతో వందనస్తుడనైయున్నాను. ఎందుకంటే ఇంతకు ముందు ఎప్పుడు కూడ నన్ను దొంగలు దోచుకోలేదు. రెండవదిగా వాళ్ళు నా పర్స్ కొట్టివేసారేమో కానీ, నా ప్రాణం మాత్రం తీయలేదు. మూడవదిగా వారు నా సమస్తాన్ని దోచుకున్నప్పటికి అది అంతా ఎక్కువ ఏమికాదు. నాల్గోవదిగా, దోచుకొనబడినది నేనే కాబట్టి మరేవరో కాదు. అందువలన నాకు ఎంతో సంతోషము.[12]

ఇంకొక ఆసక్తికరమైన కథ ఒక వృద్ధురాలు గురించి చెప్పబడినది. ఆమె ఇలా ప్రార్థన చేసింది. “దేవా! నీకు వందనములు. మీరు నాకు ఇచ్చిన పండ్లు గురించి వందనములు. ఒక పన్ను పై దవడకు, ఒక పన్ను క్రింది దవడకు ఎదురెదురుగా బిగించావు. నేను ఆహారాన్ని చక్కగా నమలగల్గుచున్నాను అని ప్రార్థించింది. నీకు వందనములు.”[13]

ఎలీషా ఆ షూనేమీయురాలు తనకు ఏమి చేసినప్పటికి ఎంత కృతజ్ఞతగా ఉన్నాడు. ఇతరులు మనకేదైనా మేలు చేసినట్టయితే మనము మౌనముగా ఉండక వారికి కృతజ్ఞత చెల్లించాలి. పెట్టీచారన్ అనే వ్యక్తి ఇలా వ్రాస్తున్నాడు, “ఎవరైనా ఏదైనా మంచి మేలు పొందితే అది మరచిపోకూడదు. ఆ మేలు చేసిన వ్యక్తి కూడ తను చేసిన దాన్ని గుర్తు ఉంచుకోకూడదు.”[14] మనము దేవుని నుండి వస్తున్న అనేక ఆశీర్వాదాలను బట్టి ఆయనకు వందనాలు చెల్లించాలి (యాకోబు 1:17). ఒక కొండజాతి స్త్రీ తన భర్త సమాధి మీద ఈ విధంగా మాటలు చెక్కించినది “ఆయన నన్ను ప్రతిసారి అభినందించేవాడు”[15] ఈ విధంగా మనందరి గురించి చెప్పితే ఎంత బాగుంటుందో కదా!

**కృతజ్ఞత: క్రియ**

ఎలీషా ఆ స్త్రీని అభినందించిన తరువాత తను ఆమెకి ఏమి చేయవలెనో అడిగాడు. *కేవలము* ఏదో మాటవరుసకు “వందనాలు” అని చెప్పి సరిపెట్టుకోలేదు. అతడు తన కృతజ్ఞతను *తెలుపు* కోవాలనుకున్నాడు. అతడు ఇలా అన్నాడు, “రాజుతోనైనను సైన్యాధిపతితోనైనను నిన్ను గూర్చి నేను మాటలాడవలెనని కోరుచున్నావా?” (2 రాజులు 4:13బి). నేను ఉన్న ప్రాంతంలో, మేము ఇలా అనవచ్చు, “నీ గురించి కొన్ని మంచి మాటలు చెప్పమంటావా?” ఇశ్రాయేలీయుల దేశంలో, రాజు సేనాధిపతి వీరిద్దరే గొప్ప శక్తిమంతులైన వ్యక్తులు, వారి జీవితాలను ఎలీషా ప్రవక్త కాపాడినాడు (2 రాజులు 3); అందువల్ల ఎలీషా ఏది అడిగినా వారు చేయడానికి ఎంతో రుణపడి ఉన్నారు. ఆ రాజుతో మాట్లాడి ఎలీషా ఆమెకు ఆమె భర్తకు ఏదో కొలువు ఏర్పాటు చేసి ఉండేవారు లేదా ఇతర రాజకీయ సంబంధమైన మేలు చేసియుండేవాడు (పన్ను వసూల నుండి తప్పించేవాడు[16]). అంతే కాకుండా సేనాధిపతికి ఒక మాట చెప్పి ఈ స్త్రీకీ ఆమె భర్తకు కొన్ని న్యాయబద్ధమైన హక్కులు కల్పించేవాడు.

ఇటువంటి మేలు బహుశ మీకు ఎవరైనా చేస్తే – బహుశ ప్రభుత్వములో పెద్ద పెద్ద అధికారులతో పరిచయము ఉన్న వ్యక్తి అయితే మీరేమి చేస్తారు? ఏమని మనవి చేసుకొంటారు? దానికి మీరే జవాబు చెప్పినప్పటికి ఆ స్త్రీ మాటలతో సరిపోల్చుకోండి. ఆమె ఇలా అన్నది, “నేను నా స్వజనుల మధ్య జీవించుచున్నాను” (2 రాజులు 4:13సి). ఆమె జవాబు చాలా సంక్షిప్తంగా చెప్పింది. CJB ప్రచురణ దీన్ని సంక్షిప్తంగా చెప్తుతుంది. “నేను నా స్వంత వాళ్ళ దగ్గర జీవిస్తున్నాను. ఎంతో సంతోషంగా ఉన్నాను. ఇంకో విధంగా చెప్పాలంటే, నేను రాజు యొక్క దయను కోరలేదు. షూనేమీలో నా ఇంటిని రాజభవనం కంటే ఎక్కువగా ఎంచుకుంటాను. నా కుటుంబములో, నా స్నేహితులతో నా ఇరుగుపొరుగు వారితో ఎలాంటి కలహాలు లేవు.” ఆమె బహుశ ఈ మాట అనేటప్పుడు తన మనస్సులో ఇలా అనుకొనవచ్చు. “మీరేదో బహుమానం ఇవ్వాలన్నట్టు నేను చేయలేదండి. మీ సేవకు ఏదైనా సహాయం దొరికితే చాలు. అదే నాకు పదివేలు.” LB (లివింగ్ బైబిల్) ఆమె జవాబును ఇలా వివరించి ఉండవచ్చును: “నేను సంతృప్తిగా ఉన్నాను.”

ఇక్కడ నేను ఎంతో ఆశ్చర్యపడుచున్నాను. ఈ స్త్రీ ఆతిథ్యం ఇవ్వడంలోనే కాదు, ఆమె హృదయంలో *సంతృప్తికరంగా* జీవించడం కూడ ఒక ప్రత్యేకతే! నాకు అనిపిస్తుంది, ఆమెకు ఒక విగ్రహం నిర్మించి దాని మీద ఈ మాటలు చెక్కితే బాగుండును అనిపిస్తుంది: "ఒక సంతృప్తికరమైన స్త్రీ!" అని హెబ్రీ పత్రికలో ఇలా ఉన్నది. "మీరు కలిగివున్న దానితో సంతృప్తిచెంది యుండుడి" (హెబ్రీయులకు 13:5; KJV; ఫిలిప్పీయులకు 4:11; 1 తిమోతి 6:8 చూడు); కానీ మనలో కొంతమందిమే ఇది సాధించగల్గుచున్నాము. సంతృప్తి కలిగిన హృదయాలున్నాయి. సంతృప్తి అంటే తెలియని హృదయాలు కోకొల్లలుగా ఉన్నాయి. బహుశ, కొంతమంది ఈ షూనేమీయురాలువలె ఉన్నదానితోనే సంతృప్తిపడడం చూచి దాన్ని నేర్చుకొని ఉంటారు.

కొన్ని మాటలతో, ఆమె ఆ గదిలోనుండి వెళ్ళిపోయింది. ఒకవేళ నేనే గనుక ఎలీషాను అయివుంటే, నేను భుజాలు దులిపి వేసుకొని, "ఆహా! నేను ప్రయత్నించాను" అంటూ నా మనస్సులోనుండి దాన్ని కొట్టివేసుకొనేవాణ్ణి. ఇక్కడ ప్రవక్త తన కృతజ్ఞత తెలియజేయడానికి *ఏదో ఒకటి* చేయాలని నిశ్చయించుకున్నాడు. అతడు గేహజీని ఒక సలహా అడిగాడు: "ఆమె నేనేమి చేయకోరుచున్నదని" (2 రాజులు 4:14ఎ).

గేహజీ వెంటనే అన్నాడు, "ఆమెకు కుమారుడు లేడు; మరియు ఆమె పెనిమిటి ముసలివాడని అతనితో చెప్పెను" (14బి వచనం). ఆ రోజుల్లో గొడ్రాలిగా ఉండడం అది ఒక శాపంలాంటిది (1 సమూయేలు 1:6, 7 చూడు). ఈ రోజుల్లో కూడ సంతానం లేమి అనేది; ఎంత దుఃఖకరమైన విషయం. ఎందరో, ఎలా రోధిస్తున్నారో? రాబర్ట్ వెనో అనే అతను కుమారుడు లేనట్టయితే ఎలాంటి పరిస్థితో వివరిస్తున్నారు:

> ... ఆ కుటుంబం ఇంటి పేరు తుడిచివేయబడుతుంది. ఆ కుటుంబానికి సంబంధించిన ఆస్తిపాస్తులు, భూములు, వేరే వాళ్ళకి చెందుతాయి. అతని యవ్వన భార్య భవిష్యత్ లెక్కలేనన్ని సంవత్సరాలుగా వైధవ్యం అనుభవించవలసి వస్తుంది. ఆమెను పట్టించుకునేవారు, ఆమె అక్కరలు తీర్చేవారు, కాపాడేవారు, లేక దిక్కులేని స్థితిలో నిలిచిపోతుంది – పిల్లలు అనే వారు ఉంటే సమాజములో వారే ఆధరువు. ...[17]

ఎలీషా, ఈ విషయాలు తన గురించి ఎందుకు ఆలోచించలేదు. దీనికి నేను ఏమి చెప్పలేను. కానీ, ఇతరులతో చెప్పుకోవడం జరుగుతుంది. ఇంతకు ముందు మనకి సంభవించని విషయాలు (మనకు తట్టని వాస్తవాలు) తెలియబడతాయి.

ఎలీషా, గేహజీ మాటలకు ఎంతో సంతోషించాడు. "ఒక ప్రవక్త అనేవాడు మంచి మాటలు" ఆ స్త్రీ గురించి దేశపు న్యాయస్థానములో చెప్పలేకపోయాడంటే, పరలోకపు న్యాయస్థానములో మంచి మాటలు చెప్పగలడేమో.[18] ఎలీషా తన సేవకుని ద్వార ఆ స్త్రీని పిలిపించాడు (2 రాజులు 4:15ఎ). ఆమె వచ్చినప్పుడు, "తలుపునొద్ద నిలుచున్నది" (15బి వచనం), అంటే దేవుని సేవకునికి ఎలాంటి చెడ్డ పేరు రాకుడదని ఆమె ఉద్దేశం.

ఇప్పుడు ఎలీషా ఆమెతో సూటిగా మాట్లాడినాడు. ఇలా అన్నాడు, "వచ్చే సంవత్సరము ఇదే కాలానికి నీ కౌగిట ఒక కుమారుని ఎత్తుకొని ఉంటావు" (16ఎ వచనం). NCV అనే ప్రచురణ ఇలా తెలుపుతుంది, "వచ్చే సంవత్సరము ఇదే సమయానికి నీవు నీ చేతులలో ఒక పిల్లవాణ్ని ఎత్తుకొని ఉంటావు."

ఆ స్త్రీ పట్టరాని ఆనందముతో ఇలా అన్నది, "దైవజనుడవైన నా యేలినవాడా, ఆలాగు పలుకవద్దు; నీ దాసురాలనైన నాతో అబద్ధమాడవద్దనెను" (16బి). తరువాత తన మాటలను ఇలా వివరించింది: "నన్ను భ్రమపెట్టవద్దని నేను చెప్పలేదా?" (28వ వచనం). ఎలీషా మాటలను అతని నమ్మకత్వమును ఆమె వమ్ము చేయలేదు. కానీ, ఆమెకు అందిన వార్త "సత్యానికి మించిపోయింది." 28వ వచనాన్ని NIV ఇలా ప్రచురించింది "నా నిరీక్షణను రేపవద్దు." కానీ, ఆమె ఆంతర్యములో వద్దు వద్దు అని అంటుందే, కానీ, లోలోపల తనకి తప్పనిసరిగా కుమారుడు కావలెనని కోరిక ఎంతగా ఉందో బయటపడుతుంది. ఆమె ఇప్పటికే ఎప్పుడో ఆశలు వదులుకున్నది – బహుశ, ఆమె ఇలా జవాబు ఇచ్చి ఉండవచ్చు: "అయ్యా! జరగని వాగ్దానములు చేసి నన్ను బాధపరచవద్దు." ఇక్కడ మనము దేవదూతలు అబ్రహాముతో శారా గర్భము ఉడిగిన తరువాత కూడ, పిల్లలను కనబోతుంది అని చెప్పినప్పుడు శారా ఎలా స్పందించిందో మనకి తెలియబడుతుంది (ఆదికాండము 18:10–12).

శారా గురించి మాట్లాడేటప్పుడు ఈ షూనేమీయురాలు కూడ, ఒక సౌభాగ్యవంతమైన కుటుంబంనుండి వచ్చినట్టును "**ప్రభువుకి** అసాధ్యమైనది ఏదిలేదు" అని గుర్తుంచుకోవాలి (ఆదికాండము 18:14). బహుశ, ఒక గొడ్రాలైన స్త్రీకి సంతానం ప్రసాదించడం ఇది మొట్టమొదటి సంఘటనే కాదు (ఆదికాండము 18:1–15; న్యాయాధిపతులు 13:2–24; 1 సమూయేలు 1:1–20; లూకా 1:5–25, 57–66).

దేవుడు ఆ స్త్రీని నిరుత్సాహపరచలేదు. "పిమ్మట ఆ స్త్రీ గర్భవతియై[19] మరుసటి యేట ఎలీషా తనతో చెప్పిన కాలమున కుమారుని కనెను" (2 రాజులు 4:17). నీకు పిల్లలున్నారా? లేక మనవళ్ళు మనవరాళ్ళు ఉన్నారా? నీకు చిన్నపిల్లలున్నారా? వారిని గమనించారా? ఒకవేళ ఉన్నట్టయితే ఈ విధంగా వరుస క్రమాన్ని గమనించగలరు.

- ఆ స్త్రీ గర్భము ధరించింది అన్న సంగతి ఆమెకి ఎక్కడలేని సంతోషాన్ని ఇచ్చింది. ఆమె గర్భములో శిశువు తిరుగుతూ వుంటే పట్టరాని ఆనందం కలిగింది.
- ఆమె ప్రసవించిన తరువాత తన కుమారుని ముఖములో చూచుకుంటే, ఆమె చేతులతో ఎత్తుకుంటే – దేవుని వైపు చూచి దేవునికి! ఈ బహుమతి నిమిత్తం వందనాలు చెప్పగలిగింది.
- తరువాత ఎలీషా ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు! ఆ పిల్లవాణ్ని ఎత్తుకొని అతనికి చూపించడానికి పరుగుతీసింది.
- అప్పుడప్పుడే ఆ బాలుడికి వస్తున్న పండ్లను, చిలకపలుకులను, తప్పటడుగులను గూర్చి ఎలీషాకు చూపిస్తుంది.

ఆ చిన్న బాలుడు ఎలీషా తొడపై కూర్చొని ఉంటే గొప్ప గొప్ప దైవజనులను గూర్చి కథలు చెప్పడం ఎంత ఆశ్చర్యంగా ఉంది కదూ? ఎలీషా ముఖములోని చిరునవ్వు ఆ స్త్రీకి ఎంతో సంతోషాన్ని కలిగించింది. నిజమైన సంతోషము, మనం ఇతరులకు సంతోషం కలిగించడం ద్వారానే మనకి లభిస్తుంది.

**ముగింపు**

ఈ కథను మనము వచ్చే పాఠములో కొనసాగిద్దాము. ఇంతవరకు చదివిన దాంట్లో అనేకమైనటువంటి సత్యాలు ఈ అంశము గూర్చి నొక్కి వక్కాణించాము, కానీ అన్నిటికంటే ఇది ఒక్కటే ప్రాధాన్యమైనది: ఆతిథ్యానికి సిద్ధంగా ఉండడం మరియు కృతజ్ఞత కలిగి ఉండడానికి సిద్ధంగా ఉండడం. ఈ పాఠం ద్వారా ఆతిథ్యాన్ని గురించి ఎంతో సంసిద్ధంగా ఉండాలని, మెచ్చుకొనుచూ అభినందించడానికి ఒక ప్రక్క దేవునికి మరో ప్రక్క ఇతరులకు రుణపడి యున్నాము.

ముగింపులో, ఈ అంశమును ఆధారం చేసుకొని ఒక ముగింపు సందేశాన్ని అందించాలనుకుంటున్నాను. ఎలీషా చేసిన బిడ్డను గురించిన వాగ్దానము షూనేమీయురాలకు నమ్మశక్యముగా లేదు. ఏది ఏమైనా ఆ యొక్క వాగ్దానం ప్రవక్త చెప్పినట్టుగానే నెరవేరింది. దేవుడు తన వాక్యంలో మనకు అనేక అద్భుతమైన వాగ్దానాలు చేసియున్నాడు:

- మనము ఆయన కుమారునియందు విశ్వాసముంచి బాప్తిస్మము తీసుకొన్నచో మన గత పాపములన్నియు తుడిచివేయబడతాయి (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 22:16).
- మనము ఆయనయందు విశ్వాసముంచి విధేయతతో జీవించినచో ఆయన మనతో ఉండి ఎన్నటికి విడనాడకుండును (మత్తయి 28:19, 20; హెబ్రీయులకు 13:5).
- మనం విశ్వాసముతో జీవించినట్టయితే, మనమీద మనం ఆధారపడకుండ ఆయన కృప మీద లక్ష్యం ఉంచినట్టయితే (ఎఫెసీయులకు 2:4), ఆయన మనలను తనతో పరలోకానికి తీసుకొని వెళ్ళి నిత్యత్వంలో ఆయనతో జీవించడానికి అవకాశం ఇస్తాడు. అక్కడ కన్నీరు కానీ, బాధ కానీ ఉండదు (ప్రకటన 2:10; 21:3, 4).

కొంతమంది స్త్రీలు దేవుని వాగ్దానాలను "నమ్మశక్యముగా భావిస్తారు." మీరు కూడ ఆయన యందు పరిపూర్ణ నమ్మిక ఉంచితే ఆ రోజుల్లో ఆ భక్తిగల స్త్రీతో చేసిన వాగ్దానాలు మీ పట్ల నెరవేరుతాయి. నీ యొక్క భవిష్యత్తు – నీ నిత్యత్వము – గురించి ఆయనపై పూర్తిగా ఆధారపడవచ్చు. ఆయనను అంగీకరించి ఆయన వాగ్దానాలను విశ్వసించగలరా? అలాంటప్పుడు ఆయన దగ్గరకు రండి!

---

సూచనలు

[1]F. W. Krummacher, *Elisha, a Prophet for Our Times* (Grand Rapids, Mich.: Kregel Publications, 1993), 59. [2]యవ్వనురాలు పెద్ద వయసులో ఉన్నవానిని ఎందుకు చేసికొనియుండవచ్చు. బహుశ అది తల్లిదండ్రులచే ఏర్పాటుచేయబడిన వివాహమై ఉండవచ్చు. [3]Donald J. Wiseman, *1 and 2 Kings: An Introduction and Commentary,* Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1993), 203. [4]J. Robert Vannoy, notes on 2 Kings, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 529. [5]Adapted from an article by Karen Maines, quot-

ed in Robert J. Morgan, *Nelson's Complete Book of Stories, Illustrations, & Quotes* (Nashville: Thomas Nelson Publishers, 2000), 452. [6]C. F. Keil and F. Delitzsch, "1 and 2 Kings," *Commentary on the Old Testament,* vol. 3, *1 and 2 Kings, 1 and 2 Chronicles, Ezra, Nehemiah, Esther* (Peabody, Mass.: Hendriksen Publishers, 1989), 310; G. Rawlinson, "2 Kings," *The Pulpit Commentary*, vol. 5, *1 & 2 Kings,* ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 65; James Burton Coffman and Thelma B. Coffman, *Commentary on Second Kings,* James Burton Coffman Commentaries, The Historical Books, vol. 6 (Abilene, Tex.: A.C.U. Press, 1992), 50. [7]Rawlinson, 65. [8]Quoted in Paul Lee Tan, *Encyclopedia of 7,700 Illustrations: Signs of the Times* (Rockville, Md.: Assurance Publishers, 1979), 1461. [9]Ibid. [10]Ibid., 1457.

[11]Ibid., 1456. [12]Quoted in James S. Hewitt, ed., *Illustrations Unlimited* (Wheaton, Ill.: Tyndale House Publishers, 1988), 264. [13]Ibid., 263. [14]Quoted in Herbert V. Prochnow, *1400 Ideas for Speakers and Toastmasters* (Grand Rapids, Mich.: Baker Books, 1994), 114. [15]Hewitt, 264. [16]Wiseman, 204. [17]Vannoy, 529. [18]Matthew Henry, *Commentary on the Whole Bible,* ed. Leslie F. Church (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1961), 404. [19]ఆమె ఏవిధంగా గర్భము ధరించిందో బైబిలు వివరించలేదు – వృద్ధుడైన భర్తపై అద్భుతం జరిగియుండవచ్చు.